నిత్య అన్నప్రసాదం

అన్నప్రసాద వితరణను ప్రారంభిస్తున్న మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ, నవంబర్ 1: ప్రతి సంవత్సరం అయ్యప్ప మాలధారకులకు నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మణికొండ శివాలయంలో స్వాములకు నిత్య అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 14 వరకు ఈ నిత్య అన్నప్రసాద వితరణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సి.రాజేందర్‌గౌడ్ గురుస్వామి, కుంట్లూరి ప్రభాకర్‌రెడ్డి గురుస్వామి, కౌన్సిలర్ కావ్యశ్రీరాములు, బాలరాజుగురుస్వామి, శ్రీనివాస్ గురుస్వామి, ఎం.రాఘవరెడ్డి, అయ్యప్ప మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

భక్తిభావన అలవర్చుకోవాలి

బాబుల్‌రెడ్డి నగర్‌లోని పోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 1 : భక్తిభావన అలవర్చుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాబుల్‌రెడ్డి నగర్ పోచమ్మ ఆలయంలో వార్షికోత్సవం, దీపావళి అమావాస్య పూజలు నిర్వహించారు. పూజలకు కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి అమావాస్యకు అన్నదానం చేయడం అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులను కార్పొరేటర్ అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేశ్, రమేశ్ రెడ్డి, సంతు గౌడ్, రమణ, గోపాల్‌నాయక్, శంకర్, కురుమయ్య, రాజు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సర్వం సిద్ధం

- సమగ్ర కుటుంబ సర్వేకు సర్వం సిద్ధం
- నేటి నుంచి హౌస్ లిస్టింగ్
- సర్వేలో 860 మంది ఎన్యూమరేటర్లు
- 6 నుంచి క్షేత్రస్థాయిలో సర్వే షురూ

ఖైరతాబాద్, నవంబర్ 1 : సమగ్ర కుటుంబ సర్వేకు జీహెచ్‌ఎంసీ సర్వం సిద్ధం చేసింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో సర్వే కొనసాగుతున్నది. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ పూర్తి చేశారు. ప్రజల నుంచి సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర 56 రకాల వివరాలతో కూడిన ఫారంతో వివరాలను సేకరిస్తారు. రెండు దశల్లో సర్వే నిర్వహించడంతో పాటు నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా ఇప్పటికే అధికారులకు ఆదేశాలు అందాయి.

సర్వేకు ప్రజలు సహకరించాలి

6 నుంచి ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలో 860 మంది ఎన్యూమరేటర్లతో సర్వేను ప్రారంభిస్తున్నాం. జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాలు సమన్వయంతో ఈ సర్వేలో పాల్గొంటాయి. నిర్ణీత సమయంలోగా సమగ్ర వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. ప్రజలందరూ 15 రోజుల పాటు ఈ సర్వే కొనసాగుతుంది. ప్రజలందరూ అందుబాటులో ఉండి ఎన్యూమరేటర్లకు వివరాలు అందజేసి సహకరించాలి.

- రజనీకాంత్ రెడ్డి, సర్కిల్ - 17, డీసీ

నేటి నుంచి హౌస్ లిస్టింగ్..

ఖైరతాబాద్ జోనల్ పరిధిలోని సర్కిల్ – 17లో 438, సర్కిల్ – 18లో 422 ఎన్యూమరేటర్ బ్లాకుల్లో ఈ సర్వే నిర్వహిస్తారు. ఈ సర్వేలో ట్యాక్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, ఎస్ఎఫ్ఏలు, బీఎల్‌వో తదితర జీహెచ్ ఎంసీలోని అన్ని విభాగాల సిబ్బంది పాలుపంచుకుంటారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లకు గాను ఇప్పటికే 40 మంది సూపర్‌వైజర్లను నియమించగా, నేటి నుంచి హౌస్‌లిస్టింగ్ (ఇంటింటికి వెళ్లి నంబర్లను నమోదు చేస్తారు.) ఈ ప్రక్రియ పూర్తి కాగానే, 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమవుతుంది.

ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం

యుద్ధప్రాతిపదికన చెత్త తొలగింపు

హైదర్‌గూడలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీసీ రవికుమార్

నారాయణగూడ ఫ్లై ఓవర్ సమీపంలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 1: దీపావళి సందర్భంగా పటాకులు కాల్చడంతో రోడ్లపై ఏర్పడిన చెత్తచెదారం తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ రవికుమార్ వెల్లడించారు. శుక్రవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ, శివానగర్ కాలనీ ప్రాంతాల్లో డీసీ జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో పర్యటించి సూచనలు చేశారు. దీంతో ఉదయాన్నే రోడ్లపై పూర్తిగా శుభ్రం చేయించామన్నారు. ప్రజలు వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని ఇంటి వద్దకు వచ్చే చెత్తసేకరణ కార్మికులకు అందించాలన్నారు. ఓపెన్ పాయింట్లు, రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని సూచించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఎంవోహెచ్, సర్కిల్ రామ్‌కీ ఇన్‌చార్జి నర్సింహారెడ్డి, ఎస్ఎస్‌లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పేరుకు పోయిన వ్యర్థాలు తరలింపు..

హిమాయత్‌నగర్ : దీపావళి సందర్భంగా హిమాయత్‌నగర్‌లో పేరుకు పోయిన పటాకులు, అలంకరణకు సంబంధించిన వ్యర్థాలను శుక్రవారం జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులు తొలగించి శుభ్రపరిచారు. నారాయణగూడ, హిమాయత్ నగర్, కింగ్ కోఠి, లిబర్టీ, హైదర్‌గూడతో పాటు బస్తీలు, కాలనీల్లో జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ –16 ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత పర్యటించారు. ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం ఎస్ఎస్ తిరుపతి నాయక్, ఎస్ఎఫ్ఎలు సోమయ్య, ఎం.శ్రీనివాస్, సతీశ్‌చంద్ర, కామేశ్, మధు, శ్రీనివాస్, అర్జున్ పాల్గొన్నారు.

9న నిర్వహించాల్సిన ఎల్ఎల్ఎం పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 1: ఓయూ పరిధిలో ఈనెల 9న జరగాల్సిన ఎల్ఎల్ఎం పరీక్షను వాయిదా వేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జరగాల్సిన పరీక్షను తిరిగి ఈనెల 12న నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష కేంద్రం, సమయంలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 1: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంటర్నేషనల్ స్టడీస్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 6వ తేదీ నుంచి, ఎమ్మెస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్ : నేడు శంషాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ షేక్‌బాబా తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి12:30 గంటల వరకు శంషాబాద్ పట్టణంలోని మధుర నగర్ ఫీడర్ 11 కేవీలో ఏర్పడిన సమస్యలను పరిష్కారం చేయడానికి నిలిపివేస్తున్నట్లు తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని మధురనగర్ కాలనీ, మహావీర్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, కూరగాయల మార్కెట్, రిజిస్ట్రేషన్ కార్యాలయం, ఆదర్శ నగర్, ఆర్బీ నగర్, శ్రీనివాస కాలనీ వాసులు సహకరించాలని కోరారు.

ఘనంగా దీపావళి వేడుకలు

మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జూబీహిల్స్ రోడ్ నం. 10లోని తన ఇంట్లో తలసాని శ్రీనివాస్ యాదవ్ తన కొడుకు సాయికిరణ్ యాదవ్, మనవడు తారక్‌లతో కలిసి పటాకులు కాల్చి ఉత్సాహంగా గడిపారు.

- బంజారాహిల్స్

బంజారాహిల్స్, నవంబర్ 1: దీపావళి వేడుకలు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడాలే కుండా పటాకులు కాలుస్తూ సందడి చేశారు. ఇంటింటా దీపాలు వెలిగించి పూజలు చేశారు. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వేడుకలను బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబసభ్యులు, మహిళా కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాదాపూర్‌లోని తన నివాసం వద్ద కుటుంబసభ్యులతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేడుకగా సదర్

ఖైరతాబాద్‌లో సదర్ వేడుకలు అంబరాన్నంటాయి. రైల్వే గేటు నుంచి బడా గణేశ్ ప్రాంగణం వరకు నిర్వహించిన దున్నపోతుల ర్యాలీ ఆకట్టుకున్నది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డిలు హాజరయ్యారు.

- ఖైరతాబాద్

ప్రతి ఇంట్లో వెలుగులు నిండాలి

ప్రతి ఇంట్లో దీపావళి వెలుగులు నిండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. దీపావళిని పురస్కరించుకోని మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కె.రామకృష్ణారెడ్డి, బుద్దోళ్లు కావ్యశ్రీరాములు, శైలజ, యాలాల లావణ్య, జ్యోతి పాల్గొన్నారు. - మణికొండ

నార్సింగి సహకార సంఘం చైర్మన్‌గా కృష్ణ

చైర్మన్‌గా విజయం సాధించిన కృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారులు

మణికొండ, నవంబర్ 1 : నార్సింగి సహకార సంఘం చైర్మన్‌గా తోలుకట్టె కృష్ణ అధికారికంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు శుక్రవారం ప్రకటించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపురంలోని సహకార సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్‌గా తోలుకట్టె కృష్ణ, వైస్ చైర్మన్‌గా అశోక్‌రెడ్డి విజయం సాధించారు. కొన్నిరోజుల క్రితం నార్సింగి సహకార సంఘ చైర్మన్‌గా పదవిలో కొనసాగిన మంచిరేవులకు చెందిన పి.సంజీవరెడ్డి సస్పెండ్ కావడంతో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. మంచిరేవులకు చెందిన డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి చైర్మన్ పదవికి నామినేషన్ వేయగా, అదే ప్యానల్‌లో నెక్నాంపూర్‌నకు చెందిన పి.సత్యనారాయణ వైస్ చైర్మన్ పదవికి, ఖానాపురం గ్రామానికి చెందిన తోలుకట్టె కృష్ణ చైర్మన్ పదవికి, వైస్ చైర్మన్ పదవికి మంచిరేవులకు చెందిన అశోక్‌రెడ్డి ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం మధ్యాహ్నం3 గంటల నుంచి ఎన్నికల నిర్వహణ చేపట్టారు. తొమ్మిది మంది డైరెక్టర్లకు గాను తోలుకట్టె కృష్ణ ప్యానల్‌కు ఐదు ఓట్లు, విష్ణువర్ధన్‌రెడ్డి ప్యానల్‌కు నాలుగు ఓట్లు పోలైనట్లు అధికారులు ప్రకటించారు. నార్సింగి సహకార సంఘం చైర్మన్‌గా తోలుకట్టె కృష్ణ, వైస్ చైర్మన్ అశోక్‌రెడ్డి ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఉత్కంఠతతో సాగిన ఎన్నికల్లో విజయం సాధించిన కృష్ణకు సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికైనట్లు ధ్రువీకరిస్తూ అధికారులు సర్టిఫికేట్ అందజేసి అభినందించారు. సహకార సంఘ చైర్మన్‌గా ఎన్నుకున్న డైరెక్టర్లకు నూతన చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సహకార సంఘాన్ని మరింతగా బలోపేతం చేసేందుకు పనిచేస్తానని కృష్ణ అన్నారు. ఖానాపురం గ్రామస్తులు ఘనంగా ఊరేగింపు చేసి ఉత్సవాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గున్నాల అమరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, మాజీ ఉప ఎంపీపీ పాపిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మన్నె గండయ్య, ఆర్.నర్సింహ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పి.కృష్ణ, నాయకులు గణేశ్, చంద్రమౌళి, విష్ణువర్ధన్ రెడ్డి, పొన్న రమేశ్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా వేణు

హిమాయత్‌నగర్ : ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జిగా బి.బి.ఆర్. వేణు నియమితులయ్యారు. శుక్రవారం వేణుకు రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు. తనకు సహకరించిన ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, కేంద మంత్రి బండి సంజయ్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రేమిస్తున్నానంటూ వేధింపులు.. కేసు నమోదు

బంజారాహిల్స్ : ప్రేమ పేరుతో యువతి వెంటపడి వేధిస్తున్న వ్యక్తిపై జూబ్లీహిల్స్ పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటగిరిలో నివాసం ఉంటున్న యువతి గతంలో యూసుఫ్‌గూడలో ఉన్న సమయంలో ఆటోడ్రైవర్ నవాజ్ పరిచయయ్యాడు. రోజూ డ్రాప్ చేస్తున్న నవాజ్ ప్రేమిస్తున్నానంటూ నమ్మించి స్నేహం చేశాడు. అతడికి అప్పటికే పెండ్లైనట్లు తెలుసుకున్న యువతి దూరం పెట్టి.. వెంకటగిరిలో ఉంటోంది. ఆమె ఫోన్‌నంబర్ తెలుసుకుని కాల్స్ చేస్తుండడంతో పాటు వెంబడిస్తూ నరకం చూపిస్తున్నాడు. గది వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ పెండ్లి చేసుకోవాల్సిందే అంటూ ఒత్తిడి తెస్తున్నాడు. బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని అసభ్యకరమైన మాటలు మాట్లాడుతున్నాడు. ఈ మేరకు బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చైనా బ్రీడ్ శునకం..

ఈ ఫొటోలో ఉన్నది చిన్నపాటి ఎలుగుబంటు అనుకుంటున్నారా..? పొరపాటు పడినట్లే ..అది ఎలుగుబంటు కాదు.. అది బుజ్జి కుక్కపిల్ల. దీని పేరు చౌ..చౌ.. ఈ కుక్కలు చైనాలో ఉంటాయి. అంబర్‌పేట డీడీ కాలనీకి చెందిన రమణ అనే రిటైర్డ్ ఉద్యోగి దీన్ని చైనా నుంచి తెప్పించుకొని ఇవాన్ అనే పేరుతో పిలుస్తున్నారు. నల్లరంగులో ఉండటంతో చాలా మంతి దీన్ని ఎలుగుబంటి అనుకుంటున్నా రు. యజమాని దగ్గరకు వెళ్లి మరీ దీని గురించి ఆరా తీస్తే చివరకు అది కుక్క అని తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

– అంబర్‌పేట, నవంబర్ 1

కార్మికుల సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దాం

ఎస్ఎన్ రెడ్డి భవన్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న బాల్‌రాజ్

హిమాయత్‌నగర్, నవంబర్ 1: కార్మికుల సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్ఎన్ రెడ్డి భవన్ ఎదుట జెండాను ఆవిష్కరించి సభ నిర్వహించారు. ఏఐటీయూసీ పోరాటాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ఎన్నో కార్మిక చట్టాలను అమలు చేయించిందన్నారు. త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా సవరించిన కేంద్ర ప్రభుత్వంపై బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వ సంస్థలు, చట్టాల అమలు, హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేం పావని, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, నాయకులు కమతం యాదగిరి, పానుగంటి పర్వతాలు, శ్రీనివాస్, పి.వెంకటయ్య, బి.కిషన్, జైపాల్‌రెడ్డి, మారగోని ప్రవీణ్ కుమార్, హసీనాబేగం, లక్ష్మీబాయి, ఉమర్‌ఖాన్, రమేశ్ పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలు సంప్రదాయానికి ప్రతీక అని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఎన్ఎస్‌బీ నగర్‌తో పాటు ఎర్రగడ్డ మోతీనగర్, ఎల్లారెడ్డిగూడల్లో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. - జూబ్లీహిల్స్

నేడు వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం

అబిడ్స్ : గుడిమల్కాపూర్, మహేశ్‌నగర్ కాలనీలో శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి అలివేలు మంగా పద్మావతి తల్లి సమేత కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని భాస్కరభట్ల రాహుల్ శర్మ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం కాలనీలో వినాయక ప్రతిమను ప్రతిష్ఠించే స్థలంలో ఈ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం ఐదు గంటలకు మహోత్సవం ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని వివరించారు. ఈ మహోత్సవంలో కాలనీ ప్రజలందరూ పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించాలన్నారు. ఈ మహోత్సవం అనంతరం కాలనీ పురవీధుల్లో పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మహోత్సవానికి అధికార, అనధికార ప్రముఖులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం పోరాటాల ఫలితమే

మెస్ చార్జీల పెంపు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సత్యం

కాచిగూడ, నవంబర్ 1: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేసిన పోరాటాల ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం దిగివచ్చి రాష్ట్రంలోని హాస్టళ్ళు, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచిందని..అందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మెస్ చార్జీల నిర్ణయంతో రాష్ట్రంలోని హాస్టళ్ళు, గురుకులలో చదువుతున్న 8 లక్షల 50 వేల మందికి ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని 295 బీసీ కాలేజ్ హాస్టళ్ళు, 321 గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సొంత భవనాలు లేవని, సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వెంటనే సొంత భవనాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేశ్, మురళీకృష్ణ, పండరీనాథ్, సూర్యనారాయణ, జానయ్య, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక సదర్

నేడు నారాయణగూడ చౌరస్తాలో ఉత్సవాలు

హిమాయత్‌నగర్, నవంబర్ 1: దీపావళి పర్వదినం సందర్భంగా.. ఐక్యతకు ప్రతీకగా ప్రతి ఏడాది యాదవులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సదర్ సందడి మొదలైంది. దీపావళి తర్వాత రెండో రోజు నేడు (శనివారం) నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. యాదవ సోదరులు సదర్ ఉత్సవాల్లో ప్రదర్శించేందుకు దున్నపోతులకు తర్ఫీదు ఇచ్చారు. యాదవులను సంఘటితం చేసేందుకు 1956లో న్యాయం చౌదరి సలంద్రి మల్లయ్య యాదవ్ ఈ సదర్ ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు యాదవులు చెబుతారు. 68 ఏండ్లుగా నారాయణగూడ చౌరస్తాలో ఈ సదర్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

పటిష్టమైన బందోబస్తు

సదర్‌ను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలి. ఉత్సవాలు నిర్వహణకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ఏసీపీలు ఆరుగురు, సీఐలు పది మంది, ఇరవై మంది ఏస్సైలు, 250 మంది కానిస్టేబుల్స్‌లతో పాటు సీసీ కెమెరాలు, మఫ్టి పోలీసులు, షీ టీమ్‌తో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశాం. ఈ ఉత్సవాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటాం. నారాయణగూడ, హిమాయత్‌నగర్, బర్కత్‌పుర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు ఉంటాయని, ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలి.

- యు.చంద్రశేఖర్, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్

3న వివాహపరిచయ వేదిక

కాచిగూడ : ఉచిత వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు. విశ్వకర్మ ఫౌండేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ .. 3న వరంగల్, భద్రకాళి టెంపుల్ రోడ్డు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉదయం 10 :30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9848199744 లలో సంప్రదించాలని కోరారు.